RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 340 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 25-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ॥

VOLUME: 18 | ISSUE : 340 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 25-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS



ఏపీ బ్రాండ్‌పై ఆందోళన కలిగించేలా జగన్ చర్యలు

అమరావతి, సిటిజన్ టైమ్స్

రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య ఒకప్పుడు బాహ్య శక్తుల నుంచి వచ్చేదని సీఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆ సమస్య ఓ రాజకీయ పార్టీ నుంచి వస్తోందని విమర్శించారు. నేతలు నేరాలు చేస్తూ.. శాంతి భద్రతల సమస్యలు సృష్టించిన రాష్ట్రాలు అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. ఉండవల్లిలోని పార్టీ కార్యాలయంలో చంద్ర బాబు మీడియాతో మాట్లాడారు. “2019-24 మధ్య వి ధ్వంసం పరాకాష్ఠకు చేరింది. తెలుగు తరువాయి 2లో..

ఉత్తరాంధ్ర వైపు దూసుకొస్తున్న
‘ఆర్నాబ్’ తుపాను..
27, 28 తేదీల్లో కుంభవృష్టి!

బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

27, 28 తేదీల్లో తీరం దాటే అవకాశం

ఉత్తర కోస్తా జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు!

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచన




అమరావతి, సిటిజన్ టైమ్స్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి తుపానుగా మారేందుకు సిద్ధమవుతోంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ఏర్పడుతున్న ఈ తొలి తుపానుకు ‘ఆర్నాబ్’ అని పేరు పెట్టనున్నారు. ఇది ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. శుక్రవారం తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది తరువాయి 2లో..

విభజన శక్తులపై ఉమ్మడి పోరు: మోదీ

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

గత కొన్ని దశాబ్దాల కాలంలో సరికొత్త సవాళ్లు, సామాజిక రుగ్మతలు ఆవిర్భ విస్తున్నాయని, వాటిని ఎదుర్కొ నేందుకు ఉమ్మడి ప్రయత్నం జరగాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. విభజనవాద శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని సంఘ టితం చేయడంతోపాటు స్వయం సమృద్ధి దిశగా పౌరుల్ని ఉత్తేజి తుల్ని చేయాలని పిలుపునిచ్చారు. దిల్లీలో మూడురోజుల పాటు జరిగే ‘చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ తరువాయి 2లో..



అరుణాచల్ సరిహద్దులో ఆ రెండు ప్రాంతాలు సున్నితమే..
చైనాతో ఘర్షణలు లేవు

అరుణాచల్‌లో అసాఫిలా, లాంగ్జూ ప్రాంతాలు సున్నితంగానే ఉన్నట్లు వెల్లడి

ఇరు దేశాల సైనికుల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగినట్లు లేని సమాచారం

ఎల్ఏసీపై భిన్నాభిప్రాయాలతో అప్పుడప్పుడు ఉద్రిక్తతలు

ఫ్లాగ్ మీటింగ్‌లు, హాట్‌లైన్ ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు

అరుణాచల్‌లో ఘర్షణలపై ఐటీబీపీ చీఫ్ వ్యాఖ్యలతో చర్చ

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

భారత్-చైనా సరిహద్దులో అరుణాచల్‌ప్రదేశ్‌లోని రెండు ప్రాంతాలు ఇప్పటికీ సున్నితంగా ఉన్నాయని రక్షణ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఇరు దేశాల సైనికుల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగినట్లు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశాయి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) విషయంలో భారత్, చైనాకు భిన్నమైన అవగాహనలు ఉండటంతో అసాఫిలా, లాంగ్జూ ప్రాంతాల్లో తరువాయి 2లో..



దామరచర్లలో గుంజకు కట్టి కొట్టినా తప్పులేదు

కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

యాద్రి ప్లాంట్‌తో లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ ప్లాన్ చేశారని ఆరోపణ

విదేశీ బొగ్గు కోసమే దూరంగా ప్లాంట్ నిర్మాణం

క్షుద్రపూజలు చేసేవాళ్లు నీతులు చెబుతున్నారంటూ హరీశ్‌పై విమర్శలు

కేసీఆర్ కుటుంబం ఏ వ్యాపారాన్నీ వదల్లేదని ఆరోపణ



సిటిజన్ టైమ్స్

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అడ్డం పెట్టుకుని రూ. లక్ష కోట్ల భారీ అవినీతికి కేసీఆర్ డిజైన్ చేశారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ కుంభకోణానికి సూత్రధారి ప్రతిమా శ్రీనివాస్ అని ఆరోపించారు. ప్రపంచంలో ఎక్కడైనా ముడిసరుకు లభించే ప్రాంతంలోనే పరిశ్రమలు స్థాపిస్తారని, కానీ కేసీఆర్ ప్రభుత్వం బొగ్గు లభించే చోట కాకుండా కృష్ణా నదీ పరీవాహక ప్రాంతమైన దామరచర్లలో యాదాద్రి ప్లాంట్‌ను నిర్మించిందని విమర్శించారు. దీనివల్ల రూ.28 వేల కోట్లతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం రూ.37,800 కోట్లకు పెరిగిందని, అంటే అదనంగా రూ.9,800 కోట్లు భారం పడిందని వివరించారు. 40 ఏళ్లలో రూ. లక్ష కోట్ల అవినీతి కోసమే ఈ ప్లాంట్‌ను కేసీఆర్ డిజైన్ చేశారని రేవంత్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టును గ్రేడ్-9 బొగ్గుతో నడిచేలా రూపొందించి, ఏటా 14 మిలియన్ టన్నుల బొగ్గును విదేశాల నుంచి దిగుమతి చేసుకునేలా ప్రణాళిక వేశారని మండిపడ్డారు. ఇంత పెద్ద అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని దామరచర్లలో గుంజకు కట్టేసి కొట్టినా తప్పులేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చాకే తరువాయి 2లో..

థాంక్యూ విజయ్..

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పోస్ట్



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వానికి కేంద్రం నుంచి ప్రశంసలు లభించాయి. రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో విమాన ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతించారు. విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తరువాయి 2లో..



న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

సౌదీ అరేబియా-హూతీ తిరుగుబాటుదారుల మధ్య దాడులతో పశ్చిమాసియాలో ఘర్షణలు మరోస్థాయికి వెళ్లాయి. సౌదీలోని మౌలిక సదుపాయాలను డ్రోన్లు, క్షిపణులతో టార్గెట్ చేస్తోన్న హూతీలు.. ఇప్పుడు కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తున్నారు. తమ ప్రత్యర్థిని అప్రతిష్టపాలు చేసేందుకు అమెరికాలోని సెక్స్ రాకెట్ సూత్రధారి జెఫ్రీ ఎప్‌స్టీన్ పేరును వాడుకుంటున్నారని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. జెఫ్రీ ఎప్‌స్టీన్ నేరాలకు సంబంధించిన పలు పత్రాలను అమెరికా న్యాయశాఖ గతంలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ దస్త్రాలపై హూతీలు దృష్టిసారించారు. సౌదీ రాయల్ కోర్ట్‌కు చెందిన అనుచరులు.. అత్యంత పవిత్ర ప్రదేశంలో కప్పిన ఒక వస్త్రాన్ని ఎప్‌స్టీన్‌కు పంపినట్లు ఆ దస్త్రాలతో వెలుగులోకి వచ్చింది. ఈ పాయింట్ పట్టుకొని సౌదీని హూతీలు ఇరకాటంలో పెట్టేస్తున్నారు. ఆ దేశానికి వ్యతిరేకంగా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. వీడియోలు, పాటలు, ప్రసంగాల రూపంలోనే గాక, ప్రముఖ ఇన్‌ఫ్లూయెన్సర్ల సోషల్ మీడియా ఖాతాల్లోనూ దీనిపై పోస్టులూ తరువాయి 2లో..

ఎడిటోరియల్

‘కూటమి’కి ఇలాంటి ప్రచారం మంచిదేనా?

ఏపీలో కూటమి పార్టీల మధ్య జరుగుతున్న చర్చలపై రాజకీయంగానే కాకుండా.. వ్యక్తిగతంగా కూడా.. ఇబ్బందికర అంశాలు తెరమీదికి వస్తున్నాయి. కొన్ని కొన్ని విషయాలు నాలుగు గోడల మధ్యే జరిగిపోవాలి. కూటమి పార్టీల ముఖ్య నేతల విషయాలు కూడా.. నాలుగు గోడల మధ్యే ఉండాలి. కానీ.. ఎవరు బయటకు చెబుతున్నారో.. ఎందు కు చెబుతున్నారో.. తెలియదు కానీ.. నాలుగు గోడల మధ్య ఉండాల్సిన విషయాలు సోషల్ మీడియాలోకి వస్తున్నా యి. తద్వారా.. ప్రజల్లో కూటమి పార్టీలపై చులకన భావం పెరుగుతోందన్న చర్చ సాగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి పార్టీలకు సీట్ల సర్దుబాటు వ్యవహారం తలనొప్పిగా మారిన విషయం తెలిసిందే. స్థానిక ఎన్నికల్లో మునిసిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి సీట్ల సర్దుబాటు అయిపోయిందని అనుకున్నా.. తర్వాత టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన రెబల్స్ రంగంలోకి దిగి నామినేషన్ వేశారు. దీనిపై పార్టీలు మౌనంగా ఉన్నాయి. ఇక, తాజాగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల వ్యవహారం తెరమీదకు వచ్చింది. వీటికి కూడా నామినేషన్ల పర్వం శుక్రవారంతో ముగిసిపోయింది. కానీ.. సీట్ల పంపకాల విషయం మాత్రం తెగలేదు. దీంతో పవన్ కల్యాణ్.. చంద్రబాబు పదే పదే కలుసుకోవడం.. సీట్ల సర్దుబాటుపై పవన్ అభ్యర్థించడం వంటివి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలుగా వస్తున్నాయి. అదేసమయంలో ప్రధాన మీడియాలోనూ ఇదే చర్చ సాగుతోంది. సహజంగానే కూటమి అన్నాక.. సీట్ల సర్దుబాటు అంత ఈజీకాకపోవచ్చు. అనుకున్నంత తేలిక కూడా కాదు. కానీ.. ఈ అంతర్గత విషయాలు సాధ్యమైనంత వరకు నాలుగు గోడల మధ్యే పరిష్కారం అయి.. ఇరు పక్షాలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత.. సంయుక్త మీడియా సమావేశం నిర్వహిస్తే.. అది విమర్శలకు తావిచ్చేది కాదు. కానీ, పదే పదే జనసేన అధినేత పవన్.. టీడీపీ అధినేతను కలుసుకున్నారని.. సీట్లపై చర్చించారని.. ఇంకా కొలిక్కి రాలేదని వార్తలు రావడంపై అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక, జనసేన కోరుతున్న సీట్లు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా లేదన్న ప్రచారం కూడా మరోవైపు టీడీపీ వర్గాల నుంచే జరుగుతోంది. జనసేన నాయకులు కూడా అసంతృప్తితోనే ఉన్నారన్న వాదన బలపడుతోంది. దీనికి కారణం.. అంతర్గతంగా చర్చించి.. ఒక నిర్ణయానికి రావాల్సిన సీట్ల వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు లీకు చేయడమేనన్నది ఇరు పార్టీల్లోని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. ఇలా చేయడం వల్ల.. కూటమిపై చులకన భావం పెరుగుతుందని అంటున్నారు. సో.. ఈ విషయాన్ని ఇరు పార్టీలు గమనించి.. చర్చలను సాధ్యమైనంత వరకు రహస్యంగానే పూర్తి చేయడం మంచిదని అంటున్నారు.

దామరచర్లలో గుంజకు కట్టి కొట్టినా తప్పులేదు

ఒడిస్సాలోని నైనీ గని నుంచి బొగ్గు తెచ్చి రైతులకు విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై కూడా రేవంత్ ఘాటుగా స్పందించారు. “క్షుద్రపూజలు చేసేవాళ్లు కూడా నీతులు చెబితే తెలంగాణ ప్రజలు ఎలా నమ్ముతారు? మంత్రగాళ్లు, నేరగాళ్లను నమ్మాల్సిన పని లేదు” అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కుటుంబం ఇసుక, బొగ్గు, భూములు, డ్రగ్స్, గంజాయి, కొకైన్ ఇలా దేన్నీ వదల్లేదని ఆరోపించారు. ఆంధ్రాలోని కాలేజీలు, ఆసుపత్రులకు పాలు సరఫరా చేసే వ్యాపారం హరీశ్‌రావు చూసుకుంటే, విదేశీ విస్కీ వ్యాపారాన్ని సంతోష్ రావు ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ‘టానిక్’ పేరుతో ప్రత్యేక పర్మిషన్‌తో వ్యాపారం నడుపుతున్నారని, దేశంలో ఇలాంటి అనుమతి ఉన్నది అదొక్కటేనని రేవంత్ రెడ్డి విమర్శించారు.

ఏపీ బ్రాండ్‌పై ఆందోళన కలిగించేలా జగన్ చర్యలు

జాతి మొత్తం తిరుగుబాటు చేసే పరిస్థితిని గత వైకాపా పాలకులు తెచ్చారు. నేరాలు, రౌడీయిజం చేసేవారిని ప్రజలు హర్షించరు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. కాంగ్రెస్ పార్టీ, వైఎస్ మనస్తత్వంతో పోల్చితే జగన్‌ది భిన్న మనస్తత్వం. ఆయన మనస్తత్వం రాష్ట్రానికే ప్రమాదం. స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు 59 పిటిషన్లు వేశారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నించారు. ఆర్థిక నిధులు రాకుండా స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు. బీసీల రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టు వరకూ వెళ్లి పోరాడాం. ఎక్కడ అవకాశం ఉంటే.. అక్కడ బీసీలకు సీట్లు ఇచ్చాం”

జగన్ అరాచకాలపై చర్చ జరగాలి..

“జగన్ పార్టీ చేస్తోన్న హింస, చెబుతున్న అబద్ధాలు, అరాచకాలపై ప్రజల్లో చర్చ జరగాలి. ఫేక్ ప్రచారం చేసి కోర్టులకు వెళ్తూ.. క్రిమినల్ లిటిగెంట్లుగా మారుతున్నారు. కోర్టులకు కూడా తప్పుడు సమాచారం ఇస్తున్నారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌పై ఆందోళన కలిగించేలా జగన్ చర్యలు ఉన్నాయి” అని చంద్రబాబు ధ్వజమెత్తారు.

వైకాపావి క్రిమినల్ పాలిటిక్స్..

“వైకాపా క్రిమినల్ పాలిటిక్స్ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దౌర్జన్యాలకు పాల్పడింది. ఓ ఎంపీ వాహనంతో ఎన్డీయే కార్యకర్తను తొక్కించారు. పుంగనూరు, రాయచోటి, కనిగిరి, దర్శి, కడప, తంబళ్లపల్లె, తిరుపతితో పాటు పలు ప్రాంతాల్లో అరాచకం సృష్టించారు. రాష్ట్రం తగులబడినా.. తమ అజెండా నెగ్గాలన్నది వైకాపా ఆలోచన” అని చంద్రబాబు మండిపడ్డారు.

జగన్ కంసమామ..

“మేనకోడలి పెళ్లి ఆపి జగన్ కంసమామగా తయారయ్యారు. షర్మిల కుమార్తె పెళ్లికి ఆహ్వాన పత్రికలు పంచాక పెళ్లికి అడ్డుపడ్డారు. సొంత చెల్లి పట్ల జగన్ అనుసరిస్తున్న తీరును ప్రజలు అర్థం చేసుకోవాలి” అని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా వైకాపా హింసాత్మక ఘటనల వీడియోలను చంద్రబాబు ప్రదర్శించారు. “అదే హింస.. అవే అబద్ధాలు.. అవే అరాచకాలు” పేరుతో బుక్‌లెట్ విడుదల చేశారు.

మేనకోడలు వివాహానికి యలహంక ప్యాలెస్ ఇవ్వనని చెబుతున్నాడు.. ఇదేం చోద్యం!

గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి రాజకీయ విలువలే కాదు, కనీస కుటుంబ, నైతిక విలువలు కూడా లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. సొంత మేనకోడలి వివాహ వేడుకకు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ ఇచ్చేందుకు నిరాకరించడం ఎంతవరకు సబబని, ఇదేం చోద్యమని ప్రశ్నించారు. ఆస్తిలో చెల్లెలికి భాగం ఉన్నప్పటికీ, మేనకోడలి పెళ్లిని అడ్డుకుని ‘కంస మామ’గా తయారయ్యారని విమర్శించారు. ఆస్తుల కోసం కన్న తల్లిని, సొంత చెల్లిని కూడా వేధిస్తున్నారని, ఆయన ఫ్యాక్షన్ మనస్తత్వం రాష్ట్రానికి ఎంత ప్రమాదకరమో ప్రజలు అర్థం చేసుకోవాలని చంద్రబాబు హితవు పలికారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ఈ మేరకు వ్యాఖ్యానించారు. “రాజకీయ ముసుగులో ఉన్న ఆ వ్యక్తి నిరంతరం అసత్యాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరు నుంచి వచ్చి ‘హిట్ అండ్ రన్’ తరహాలో ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లిపోతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే పనిగా పెట్టుకున్నారు” అని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోందని ఆ పార్టీకి చెందిన మాజీ డిప్యూటీ స్పీకరే చెబుతున్నా, ఆ పార్టీ అధ్యక్షుడు మాత్రం హింస జరుగుతోందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో తమ పాలనలో 24 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అప్పుడు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి, నాటి ఎన్నికల కమిషనర్‌నే బెదిరించి, ఆయన కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితిని కల్పించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి పాలనలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని, 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు 51,902... 659 జెడ్పీటీసీ స్థానాలకు 5,724 నామినేషన్లు దాఖలు కావడమే ఇందుకు నిదర్శనమని చంద్రబాబు వివరించారు. “రాజకీయాల్లో ఇలాంటి నేరస్థులను నేనెప్పుడూ చూడలేదు. క్రిమినల్స్‌ను రాజకీయాల్లోకి తెచ్చి నానా యాగీ చేస్తున్నారు. గొడ్డలి పార్టీ హింసకు ప్రేరేపిస్తుంటే, కూటమి మాత్రం శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. హింసకు ప్రతిహింస మా విధానం కాదు, అలా అని భయపడి వెన్నుచూపే ప్రసక్తే లేదు” అని స్పష్టం చేశారు. పులివెందులలో ఎన్నడూ ప్రజాస్వామ్యం లేదని, ఎదురు మాట్లాడిన వారి గొంతు నొక్కేశారని, ఇప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్య వాతావరణం చూసి ఫ్రస్టేషన్‌తో కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. వారి కుతంత్రాలతో రక్తపాతం సృష్టించే ప్రయత్నాలను సాగనివ్వబోమని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడి చుట్టూ సీబీఐ, ఈడీ కేసులు, అక్రమాస్తులు, మద్యం కుంభకోణాలు ఉన్నాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన కారణంగా ఎంతోమంది అధికారులు, నేతలు జైలుకు వెళ్లారని తెలిపారు. “సొంత బాబాయిని చంపి, ఆ నేరాన్ని చెల్లెలిపై నెట్టే ప్రయత్నం చేశారు. నిందితుడిని అరెస్ట్ చేయడానికి సీబీఐ వస్తే అడ్డుకున్న వ్యక్తి, ఈరోజు విలువల గురించి, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది” అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తాము ఎన్నికల సమయంలో కూడా సమీక్షలు నిర్వహిస్తుంటే, ఆయన మాత్రం విధ్వంసమే ధ్యేయంగా పెట్టుకున్నారని, ఇలాంటి వ్యక్తిగత కక్షలు, ఫ్యాక్షన్ మనస్తత్వం రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

థాంక్యూ విజయ్..

తీసుకురావాలంటే కేంద్రం, రాష్ట్రాలు కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో విమానయాన సంస్థలకు ఈ నిర్ణయం కొంత ఊరటనివ్వనుంది. తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. చెన్నై విమానాశ్రయంలో విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై వ్యాట్‌ను ప్రస్తుతం ఉన్న 29 శాతం నుంచి 16 శాతానికి తగ్గించారు. రాష్ట్రంలోని ఇతర విమానాశ్రయాల్లో ఈ పన్నును 29 శాతం నుంచి కేవలం ఒక శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయం నవంబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. 2027 అక్టోబర్ 31 వరకు ఈ పన్ను రాయితీ కొనసాగుతుంది. రాష్ట్రంలోని నగరాల మధ్య విమాన సర్వీసులను పెంచడం, విమానయాన సంస్థల నిర్వహణ ఖర్చులను తగ్గించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన లక్ష్యాలు. నిర్ణయంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. విమాన ఇంధనంపై వ్యాట్ తగ్గింపు విమానయాన రంగానికి స్వాగతించదగిన చర్య అని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి విజయ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విమాన ప్రయాణాన్ని మరింత చౌకగా మార్చేందుకు కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలని, ప్రయాణికుల ప్రయోజనాలే ఉమ్మడి ప్రాధాన్యంగా ఉండాలని అన్నారు. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో కూడా తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. ముఖ్యమంత్రి విజయ్‌కు కృతజ్ఞతలు తెలిపింది. ఇలాంటి చర్యలతో విమాన మార్గాల అనుసంధానం మెరుగుపడుతుందని, రాష్ట్రంలో పర్యాటకం, ఆర్థికాభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొంది.

విమానయాన రంగం మరింత బలోపేతం కావడానికి, విమాన ప్రయాణం ఎక్కువ మందికి అందుబాటులోకి రావడానికి ఇలాంటి నిర్ణయాలు దోహదపడతాయని అభిప్రాయపడింది. తమిళనాడులో విమాన ఇంధనంపై అధిక పన్నుల కారణంగా కొత్త విమాన సర్వీసులను ప్రారంభించేందుకు విమానయాన సంస్థలు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు గతంలో వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా కోయంబత్తూరు, సేలం వంటి పారిశ్రామిక నగరాల నుంచి మరిన్ని విమాన సర్వీసులు ప్రారంభించాలన్న డిమాండ్లు ఉన్నాయి. తాజాగా ప్రకటించిన పన్ను తగ్గింపుతో రాష్ట్రంలోని విమాన కనెక్టివిటీ మెరుగుపడుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. అయితే, ఈ నిర్ణయం వల్ల విమాన టికెట్ల ధరలు ఎంతమేర తగ్గుతాయన్నది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

అరుణాచల్ సరిహద్దులో ఆ రెండు ప్రాంతాలు సున్నితమే..

చైనాతో ఘర్షణలు లేవు

అప్పుడప్పుడు ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయని తెలిపాయి. ఈ రెండు ప్రాంతాలు అరుణాచల్‌ప్రదేశ్‌లోని తక్సింగ్ సర్కిల్ పరిధిలో ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోనే ఉందని పేర్కొన్నాయి. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో చైనా సైన్యంతో ముఖాముఖి పరిస్థితులు కొనసాగుతున్నాయని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో సరిహద్దు పరిస్థితిపై చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో అసాఫిలా, లాంగ్జూ ప్రాంతాల్లో భారత, చైనా సైనికుల గస్తీ బృందాలు సాధారణ విధుల్లో భాగంగా ఎదురుపడుతున్నాయని రక్షణ వర్గాలు వివరించాయి. అయితే, క్షేత్రస్థాయిలోని కమాండర్లు సంయమనం పాటిస్తూ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా చూస్తున్నారని తెలిపాయి. స్థానికంగా తలెత్తే ఈ ముఖాముఖి పరిస్థితులను పరిష్కరించేందుకు ఇరు దేశాల సైన్యాలు ఇప్పటికే అమల్లో ఉన్న సంప్రదింపుల వ్యవస్థలను ఉపయోగిస్తున్నాయని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఫ్లాగ్ మీటింగ్‌లు, హాట్‌లైన్ ద్వారా సమాచార మార్పిడి జరుగుతోందని చెప్పారు. ఈశాన్య ప్రాంతంలో ఇటీవల జరిగిన కోర్ కమాండర్ స్థాయి చర్చలు కూడా కీలకమైనవిగా పేర్కొన్నారు. సరిహద్దు వివాదాల పరిష్కారానికి సైనిక, దౌత్య మార్గాల్లో చర్చలు కొనసాగడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు. సరిహద్దు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, ఇతర పౌర సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. వీటివల్ల సైనికుల కార్యకలాపాలకు తోడ్పాటు లభించడంతోపాటు మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా, వైద్యం వంటి సేవలు మెరుగుపడతాయని పేర్కొన్నాయి. భవిష్యత్తులో భద్రతాపరమైన పరిస్థితులు అనుకూలిస్తే నియంత్రిత సరిహద్దు వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలను పెంచే అవకాశాలూ ఉన్నాయని వివరించాయి. ఈ ప్రాంతానికి మతపరమైన, సాంస్కృతిక ప్రాధాన్యం కూడా ఉంది. ఇరు దేశాల బౌద్ధ సమాజాలకు పవిత్రమైన చారిత్రక త్సారి తీర్థయాత్ర మార్గం ఇక్కడి ప్రత్యేకతల్లో ఒకటి. సరిహద్దులో శాంతి నెలకొంటే భవిష్యత్తులో ఈ యాత్రకు సంబంధించి సరిహద్దు దాటే అవకాశాలను పరిశీలించవచ్చని అధికారులు తెలిపారు. అయితే, ఇందుకు ఇరు దేశాల అంగీకారంతోపాటు భద్రతాపరమైన పరిస్థితులు అనుకూలంగా ఉండాలి. మారుమూల ప్రాంతాల్లో సైన్యం వైద్య శిబిరాలు, అత్యవసర తరలింపులు, పాఠశాలల నిర్మాణం, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి కార్యక్రమాల్లోనూ పాలుపంచుకుంటోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, చైనా సైనికులు నిర్దేశిత గస్తీ విధానాలకు భిన్నంగా వ్యవహరించినప్పుడు సరిహద్దులో పరిస్థితులు అప్పుడప్పుడు దెబ్బతింటున్నాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం పేర్కొన్నారు. నిర్దిష్ట ప్రాంతాల్లో జరుగుతున్న పరిణామాలపై ప్రశ్నలను రక్షణ శాఖకు నివేదించాలని సూచించారు. సరిహద్దులో శాంతి, ప్రశాంతత కొనసాగడం ద్వైపాక్షిక సంబంధాల అభివృద్ధికి అవసరమని స్పష్టం చేశారు.

మొదటి పేజీ తరువాయి

కొత్త ఆయుధంతో సౌదీకి హూతీల షాక్..

ప్రత్యక్షమవుతున్నాయి. సౌదీ-హూతీల మధ్య కొన్నేళ్ల పాటు అమల్లో ఉన్న అప్రకటిత కాల్పుల విరమణకు కొన్ని నెలల క్రితం బ్రేక్ పడింది. దాంతో రెండు వర్గాల మధ్య దాడులు తీవ్ర రూపం దాల్చాయి. పవిత్ర మక్కా నగరంపై ఆ రెబల్స్ గ్రూప్ దాడులకు యత్నించిందంటూ సౌదీ ఆరోపించింది. అయితే, దాన్ని హూతీలు ఖండించారు. ఆ పవిత్ర స్థలానికి సంబంధించిన వస్త్రాన్ని ఎవ్‌స్టీన్‌కు ఇచ్చిన వారే (సౌదీని ఉద్దేశిస్తూ).. మక్కాపై దాడికి యత్నించారంటూ హూతీ గ్రూప్ అధ్యక్షుడు మహ్దీ అల్ మషత్ పేర్కొన్నట్లు అంతర్జాతీయ మీడియా తన కథనంలో రాసుకొచ్చింది. మహ్దీ సందేశం సోషల్ మీడియా వేదికల్లో వైరల్ అయింది. యెమెన్ కమెడియన్ ఒకరు దీనిపై వీడియో చేశారు. కాగా.. ఈ ఆరోపణలు, అలాగే పవిత్ర వస్త్రం చిత్రాలకు సంబంధించిన కథనాలపై సౌదీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందనా రాలేదు. టీనేజ్ బాలికలను, యువతులను మోసపూరితంగా లొంగదీసుకొని జెఫ్రీ ఎవ్‌స్టీన్ ఒక నేర నెట్‌వర్క్‌ను సృష్టించాడు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులుగా చెలామణీ అయిన చాలా మంది ఆ అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. దానికి సంబంధించిన కొన్ని లక్షల ఫైళ్లను ఈ ఏడాది ప్రారంభంలో అమెరికా న్యాయశాఖ విడుదల చేసింది. ఎవ్‌స్టీన్ 2019లో జైల్లో మరణించాడు. కానీ ఇప్పటికీ ఆ ఫైళ్లు ప్రపంచ దేశాలకు చెందిన పలువురు ప్రముఖులను వణికిస్తూనే ఉన్నాయి.

ఉత్తరాంధ్ర వైపు దూసుకొస్తున్న

‘ఆర్నాబ్’ తుపాను..

శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా మారి, సోమవారం (అక్టోబర్ 26) ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. ఆ తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపునకు చేరుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. తుపాను ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లో గంటకు 70 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని వాతావరణ నమూనాలు ఇది మరింత బలపడి తీవ్ర లేదా అతి తీవ్ర తుపానుగా మారవచ్చని సూచిస్తున్నాయి. ఈ నెల 27, 28 తేదీల్లో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు, అక్కడక్కడా కుంభవృష్టి కురిసే అవకాశం ఉంది. ఒడిశా తీరంలోనూ ఇదే తరహాలో వర్షాలు పడతాయని హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. సంబంధిత జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేశాయి. సముద్రం అలజడిగా ఉన్నందున, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని ఐఎండీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఖరీఫ్ పంట కోత దశలో ఉన్నందున, రైతులు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు తుపాను కదలికలను నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని విడుదల చేస్తున్నారు. ప్రజలు అధికారిక ప్రకటనలను మాత్రమే అనుసరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విభజన శక్తులపై ఉమ్మడి పోరు: మోదీ

సమ్మేళన్’ను శుక్రవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు.

ఒక ఆలోచన.. స్వచ్ఛమైన చైతన్యం

“చిన్మయ మిషన్ వ్యవస్థాపకులైన స్వామీ చిన్మయానంద దార్శనికతను ముందుకు తీసుకు వెళ్లేందుకు గత పాతికేళ్లుగా సేవలందిస్తున్నాను. వేదాంతాలు, భగవద్గీత అందించే జ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రపంచవ్యాప్త ఆధ్యాత్మిక ఉద్యమాన్ని ఈ సంస్థ నడిపిస్తోంది. ఇదొక సంస్థ మాత్రమే కాదు.. ఒక ఆలోచన! చిన్మయ అంటే స్వచ్ఛమైన చైతన్యం. దైవత్వ సంకల్పంతో సంస్థ ప్రస్థానం కొనసాగుతోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలనే సంకల్పం దిశగా ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలి. మరింత క్రియాశీలంగా మనమంతా వ్యవహరించాలి. స్వామీ చిన్మయానంద వంటివారు ఎంతో దూరదృష్టితో చేసిన దార్శనికత దిశగా దేశం ఇప్పుడు తన బాధ్యతల్ని నిర్వర్తిస్తోంది. సరికొత్త భారతావనికి తగ్గట్టు విద్యావ్యవస్థ ఉండాలనే ‘జాతీయ విద్యా విధానం’ తీసుకువచ్చాం. మాతృభాషలో బోధన, భారతీయ విజ్ఞాన వ్యవస్థ ప్రాధాన్యానికి పెద్దపీట వేయడం వంటివి దీనిలో ఉన్నాయి. నా ప్రయత్నాలు, విధానాల్లో యువతది కీలకపాత్ర. అమృత మహోత్సవాల్లో యువత సుమారు 300 రోజుల్లో 40,000 కి.మీ. మేర ప్రయాణించడం అభినందనీయం” అని మోదీ చెప్పారు. దేశానికి చెందిన విలువైన కళాఖండాలు విదేశాలకు తరలిపోయినా ఎవరూ ప్రశ్నించేవారు కాదని, గత 12 ఏళ్లలో అలాంటి 650 వస్తువుల్ని తాము వెనక్కి రప్పించామని తెలిపారు. త్రీడీ హోలోగ్రఫిక్ డిజిటల్ రూపంలో కనిపించిన స్వామీ చిన్మయానందతో ప్రధాని ఈ సందర్భంగా సంభాషించారు. తాను 33 ఏళ్ల వెనక్కివెళ్లి ఆయనతో మాట్లాడుతున్నట్లు అనిపించిందని చెప్పారు.

75 ఏళ్ల ప్రస్థానం

ప్రపంచవ్యాప్త ఆధ్యాత్మిక ఉద్యమం కోసం 1951లో ఆవిర్భవించిన చిన్మయ మిషన్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఏడాది కాలం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముగింపు వేడుకల్లో దేశవిదేశాలకు చెందిన 9,000 మంది పాల్గొంటున్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ తనిఖీ..

అధికారులకు కీలక ఆదేశాలు

పద్మనాభంలో పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జిల్లాలో నవంబర్ 3న జరగనున్న మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం పద్మనాభం మండలాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్ పత్రాలతో పాటు అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ల పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటిస్తూ అభ్యర్థులందరికీ నిబంధనల ప్రకారం సమాన అవకాశాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న అభ్యర్థులతో మాట్లాడి నామినేషన్ల పరిశీలన ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

అనంతరం పద్మనాభంలో పరిషత్ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని, ఎన్నికల సిబ్బందికి



ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని



సూచించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని ముందుగానే సమీక్షించి, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణ మూర్తి, ఏసీపీ అప్పలరాజు, మండల ప్రత్యేక అధికారి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో విశాఖలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు

10 మద్యం బాటిళ్లు, ధ్రువపత్రాలు లేని 11 వాహనాలు స్వాధీనం



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా విశాఖ నగర పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ ఆదేశాల మేరకు కంచరపాలెం, ద్వారకా, మహారాణిపేట, పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని ఇళ్లు, దుకాణాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 10 మద్యం బాటిళ్లతో పాటు, సరైన ధ్రువపత్రాలు లేని 11 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను అరికట్టేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో గాజువాక పోలీసుల నోటీసులు

పోలింగ్ కేంద్రాల సమీప నివాసితులకు కీలక సూచనలు



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు గాజువాక పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 1, 2026న జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నివసిస్తున్న ఇంటి యజమానులు, నివాసితులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు ఎవరూ పాల్పడరాదని, ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని నోటీసుల ద్వారా స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గాజువాక పోలీసులు విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు సహకరించి, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

కూటమి అభ్యర్థుల తరఫున మారెడ్డి లతా రెడ్డి విస్తృత ప్రచారం

చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారితో పాటు కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం



పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థుల తరఫున మాజీ జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలను నేరుగా కలుసుకుని, కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో ప్రజల సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తూ, అభ్యర్థుల తరఫున ప్రచారాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు..

నీటి పొదుపే మన ముందున్న కర్తవ్యం!

వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలపై అప్రమత్తత అవసరం..

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

సిటిజన్ టైమ్స్ స్పెషల్ , అక్టోబర్ 24:

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులకు కారణమవుతున్న ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితులు బలపడితే వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనాలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయం, తాగునీటి సరఫరా, జలవనరులపై ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో నీటి వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. రానున్న నెలల్లో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వినియోగించే అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు.

నీటి వృథాను అరికట్టాలి

తాగునీటిని అవసరానికి మించి వినియోగించకూడదని, ఇంటి అవసరాల్లో నీటి వృథాను అరికట్టాలని సూచిస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టే విధానాలను ప్రోత్సహించడం, ఇంకుడు గుంతల ఏర్పాటు, భూగర్భ జలాల సంరక్షణ వంటి చర్యలు చేపట్టడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను కొంతవరకు ఎదుర్కోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయ రంగంలోనూ నీటి వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. వర్షపాతం పరిస్థితులను బట్టి పంటల ఎంపిక, సాగునీటి వినియోగంపై రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది.

విద్యుత్ వినియోగంలోనూ పొదుపు అవసరం

వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగే పరిస్థితుల్లో విద్యుత్ అవసరాలు కూడా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల అవసరం లేని సమయంలో విద్యుత్ దీపాలు, ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయడం, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలపై ఆందోళన వద్దు.. పరిస్థితులను గమనించాలి వర్షాభావం వ్యవసాయ దిగుబడులపై ప్రభావం చూపితే కొన్ని పంటల సరఫరా, ధరల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఎల్‌నినో కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు తప్పనిసరిగా పెరుగుతాయని లేదా వస్తువులపై జీఎస్‌టీ పెరుగుతుందని ఇప్పుడే నిర్ధారించలేం. ధరలు, వస్తువుల మార్పులపై అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని సూచిస్తున్నారు. వాతావరణ మార్పులపై భారత వాతావరణ శాఖ విడుదల చేసే తాజా సూచనలు, హెచ్చరికలను ప్రజలు గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, సహజ వనరులను సంరక్షించడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజల అప్రమత్తత, సహకారమే ప్రకృతి వనరుల సంరక్షణకు కీలకం.

ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

నార్త్ జోన్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శనివారం నార్త్ జోన్ పరిధిలోని 49, 53 వార్డులకు సంబంధించి జ్ఞానకేతన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను నార్త్ జోనల్ స్పెషల్ ఆఫీసర్ కె. జ్ఞానవేణి, అదనపు కమిషనర్ పి. నల్లనయ్యతో కలిసి ఆయన పరిశీలించారు. 49వ వార్డుకు ఐదు, 53వ వార్డుకు మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, టెంట్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైన ఎన్నికల సామగ్రిని నిర్దిష్ట సమయంలో తరలించాలని ఆదేశించారు. ఆహార వ్యర్థాలు చెల్లాచెదురుగా పడకుండా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి కృష్ణంరాజుకు సూచించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్లు పల్లంరాజు, సంపత్ కుమార్, నార్త్ జోనల్ కమిషనర్ బి. రాము, కార్యనిర్వాహక ఇంజనీర్లు మురళి, పద్మజ, ఏసీపీ తిరుపతిరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన

బందోబస్తును పర్యవేక్షించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



గుర్రంకొండ అక్టోబర్ 24 సిటిజన్ టైమ్స్

గుర్రంకొండ మండలంలో జరుగుతున్న ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియను రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన గుర్రంకొండలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను, భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ అధికారులను ఆదేశించారు. కార్యాలయ ప్రాంగణంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని గుర్రంకొండ ఎస్సై రవీంద్రబాబును ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది మరియు ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం.. ప్రతి ఏర్పాటూ పకడ్బందీగా ఉండాలి!

ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు రాకూడదు.. ఓటర్లకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి: కమిషనర్ కేతన్ గార్గ్





విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి పోలింగ్ కేంద్రాల నిర్వహణ వరకు ప్రతి అంశంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. శనివారం మధురవాడ జోన్‌లోని సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లు, పోలీసు బందోబస్తు, బస్సుల పార్కింగ్ ఏర్పాట్లను కమిషనర్ కేతన్ గార్గ్ స్పెషల్ ఆఫీసర్ పద్మలత, అదనపు కమిషనర్ పి.ఎం. సత్యవేణితో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, విధులకు ఉదయం 7 గంటలకు హాజరయ్యే సిబ్బందికి ఉదయం 5.30 నుంచి 6 గంటల మధ్య అల్పాహారం అందించాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, హెల్ప్ డెస్క్‌లు, బస్సుల పార్కింగ్ ప్రాంతాలను సులభంగా గుర్తించేలా స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వర్ష సూచన నేపథ్యంలో వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందికి తాగునీరు, ఆహారం, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులపై సంబంధిత జోన్ పేరు, వార్డు నంబరు, పోలింగ్ కేంద్రం నంబరు స్పష్టంగా కనిపించేలా చూడాలని అధికారులకు తెలిపారు. పోలింగ్ సిబ్బందిని నిర్దిష్ట సమయానికి కేంద్రాలకు చేర్చేందుకు బస్సు మార్గాలను ముందుగానే ఖరారు చేయాలని, బస్సుల కేటాయింపు, పార్కింగ్, రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెకానికల్, ఇంజనీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో సమయపాలన, సమన్వయం, బాధ్యతాయుతమైన నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

అనంతరం ఆర్‌హెచ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఓటర్లకు తాగునీరు, నూచిక బోర్డులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు అందించారు. తదుపరి చంద్రంపాలెం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు సిబ్బందిని నియమించి పటిష్ఠ భద్రత కల్పించాలని పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణకు సూచించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు, ఎన్నికల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, పోలింగ్ సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించాలని కేతన్ గార్గ్ అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ ఇప్పి నాయుడు, రిటర్నింగ్ అధికారులు ఆదినారాయణ, ఉమామహేశ్వరరావు, మధురవాడ సూపరింటెండింగ్ ఇంజనీర్ శాంతిరాజు, ఏసీపీ గౌడ్, ఏఎంఓహెచ్ రవి, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రెండో వార్డులో సీపీఎం అభ్యర్థి ఆర్ఎస్ఎన్ మూర్తి విస్తృత ప్రచారం

సంగివలస, రాజవీధి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం



తగరపువలస, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ రెండో వార్డు సీపీఎం అభ్యర్థి ఆర్ఎస్ఎన్ మూర్తి శనివారం వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంగివలస, సంగివలస కాలనీ, రాజవీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుని, తనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ ఎన్నికల గుర్తులైన సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తులపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను ఎన్నికల్లో విజయం సాధిస్తే రెండో వార్డు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని మూర్తి తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేస్తూ తనకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం భీమిలి జోన్ సహాయ కార్యదర్శి ఎస్. అప్పలనాయుడు, పార్టీ నాయకులు రవ్వ నరసింగరావు, కె. నాగరాణి, సీఐటీయూ భీమిలి మండల అధ్యక్షుడు నీలాతి రాము, నాయకులు పల్లా పెంటరాజు, నమ్మి అప్పలనాయుడు, రీసు నరసింగరావు, గుజ్జు నరసింగరావు, ఎం. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 1వ వార్డులో కూటమి అభ్యర్థి ఇప్పాక వరలక్ష్మి ఇంటింటి ప్రచారం



తగరపువలస, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో తొలి వార్డులో కూటమి అభ్యర్థి ఇప్పాక వరలక్ష్మి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించారు. వార్డులోని రామన్నపేట, శ్రీనగర్ కాలనీ, విల్సన్ పేట, అల్లంకి వీధి, జోగా వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి తనకు మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించి వార్డు అభివృద్ధికి కృషి చేయాలనే లక్ష్యంతో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు, కార్యకర్తలు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొప్పల రమేష్, తమ్మిన సూరిబాబు, పిట్ట సురేష్, ఎర్నింటి వెంకటరావు, నవీరి రాజు, మీసాల పేరయ్య, ఎర్నింటి సత్యనారాయణ, తొంపల సూరిబాబు, మద్దిల దేవుళ్లు, బోణీ కార్తీక్, తాటిపూడి అప్పలరాజు, నరవ రామారావు, భోగాపురపు గోవింద, కోసూరి వెంకటేష్, మద్దిల సుబ్బారావు, చిలకా నర్సింగరావు, గిడుతురు పూర్ణ, తీన్ మూర్తి, శ్రీరామ్, కుప్పిలి వెంకటరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హెటిరో కంపెనీ సహకారంతో అంగన్వాడి చిన్నారులకు విద్య సామాగ్రి పంపిణీ

అందజేసిన కౌన్సిలర్ ఆది గీత రామకృష్ణ



జిన్నారం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 24:

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ పరిధి రాళ్లకత్వ గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో హెటిరో కంపెనీ సహకారంతో చిన్నారులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, షూస్ పంపిణీ చేశారు. అంగన్వాడి టీచర్ ఆది పుణ్యవతి చేతుల మీదుగా పిల్లలకు విద్యా సామగ్రిని అందజేశారు. చిన్నారుల విద్యాభివృద్ధికి ప్రోత్సాహంఈ సందర్భంగా కౌన్సిలర్ ఆది గీతా రామకృష్ణ మాట్లాడుతూ, చిన్నారులకు విద్యా సామగ్రి అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పిల్లల చదువుకు ప్రోత్సాహం అందించేలా హెటిరో కంపెనీ ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సహాయ కార్యక్రమాలు చిన్నారుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతోపాటు వారి భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ ఆది పుణ్యవతి, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీసు విధులపై అవగాహన

విశాఖ సీపీ ఆదేశాలతో

నగర వ్యాప్తంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు--2026లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు విశాఖ నగరవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, ఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసుల విధులు, ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. డాగ్ స్క్వాడ్, బాంబు డిటెక్షన్, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీమ్‌ల పనితీరును వివరించారు. అల్లర్ల నియంత్రణలో పోలీసుల చర్యలను తెలియజేస్తూ, వజ్ర వాహనం ద్వారా బాష్పవాయువు ప్రయోగించే విధానాన్ని ప్రదర్శించారు. పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పోలీసు వ్యవస్థ, భద్రతా చర్యలపై అవగాహన పొందారు. కార్యక్రమం నిర్వహించిన పోలీసు శాఖకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

బి-ఫారం ఇవ్వకుండా అన్యాయం చేశారు

కాంగ్రెస్‌కు విధేయురాలిగానే ఉంటా.. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తా: ప్రియాంక దండి



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు తన పేరును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అధికారికంగా ప్రకటించినప్పటికీ, జిల్లా పార్టీ నాయకులు బి-ఫారం ఇవ్వకుండా అన్యాయం చేశారని విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రియాంక దండి ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై అధిష్ఠానం విచారణ జరిపి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అయినప్పటికీ తాను కాంగ్రెస్ పార్టీకి విధేయురాలిగానే కొనసాగుతానని, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

అధికారిక ప్రకటన చేసినా బి-ఫారం ఇవ్వలేదు

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తన పేరును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి అధికారికంగా ప్రకటించారని ప్రియాంక దండి తెలిపారు. తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేసే బాధ్యతను డీసీసీ అధ్యక్షుడు, పీసీసీ ఉపాధ్యక్షులకు అప్పగించారని పేర్కొన్నారు. అయితే, అధ్యక్షురాలి ఆదేశాలను విస్మరించి మరో అభ్యర్థికి మధ్యాహ్నం 2.45 గంటల సమయంలో బి-ఫారం అందజేశారని ఆరోపించారు. అదే రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు షర్మిలా రెడ్డి రిటర్నింగ్ అధికారికి మరో లేఖ రాస్తూ, గతంలో అందజేసిన బి-ఫారాన్ని రద్దు చేసి, పార్టీ అధికారికంగా ప్రకటించిన తన అభ్యర్థిత్వాన్ని గుర్తించాలని కోరినట్లు వివరించారు. సంబంధిత లేఖలను కూడా తన ప్రకటనకు ఆధారాలుగా జతపరిచినట్లు తెలిపారు. అయితే, నిర్దిష్ట గడువులోగా లేఖ అందజేసినా, నిబంధనల ప్రకారం అవసరమైన బి-ఫారం అందుబాటులో లేకపోవడంతో తనను కాంగ్రెస్ అధికారిక అభ్యర్థిగా గుర్తించలేదని పేర్కొన్నారు. చివరి నిమిషం వరకు బి-ఫారం కోసం ప్రయత్నించడంతో నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశం కూడా కోల్పోయానని, దీంతో స్వతంత్ర అభ్యర్థిగా మిగిలిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేయండి

తనకు టికెట్ రాలేదని, టికెట్ తెచ్చుకోవడంలో విఫలమయ్యానని మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవం కాదని ప్రియాంక దండి స్పష్టం చేశారు. చివరి నిమిషం వరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి తనకు అండగా నిలిచారని తెలిపారు. జిల్లా నాయకుల చర్యల వల్ల పార్టీకి నష్టం జరగకూడదనే ఉద్దేశంతో, స్వతంత్ర అభ్యర్థిగా తనకు ఓట్లు వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని తన అభిమానులు, అనుచరులు, శ్రేయోభిలాషులను కోరారు.

శ్రీసత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 26న ప్రత్యేక పూజలు

స్వామివారి ఆరాధన, ధ్వజస్తంభ పూజలకు ఏర్పాట్లు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24: విశాఖపట్నం నగరంలోని ఇసుకకొండపై వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈ నెల 26వ తేదీ, సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక ఆరాధనలు, పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 2 గంటలకు స్వామివారి ఆలయంలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 4 గంటల వరకు స్వామివారి ఆరాధన కార్యక్రమం కొనసాగనుంది. అనంతరం ఉదయం 4.30 గంటల నుంచి స్వామివారికి పూజలు నిర్వహించనున్నారు.

ధ్వజస్తంభ పూజలు

ధ్వజస్తంభ పూజలు ఉదయం 4 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ పూజలో పాల్గొనే భక్తులు రూ.1,116 చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా శ్రీ సత్యనారాయణ స్వామివారి ప్రత్యేక పూజలు ఉదయం 7 గంటల నుంచి



10.30 గంటల వరకు, అలాగే ఉదయం 8.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పూజలకు సంబంధించి రూ.1,116, రూ.516 రుసుములు నిర్ణయించారు. అన్నసంతర్పణ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటల నుంచి ప్రారంభం కానుంది.

భక్తులకు ఆలయ అధికారుల విజ్ఞప్తి

స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు ముందుగా నిర్ణయించిన పూజా సమయాలను గమనించి, కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ అధికారులు సూచించారు. స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజల సమయంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి సభ్యులు వెల్లడించారు.

ఆరెపల్లిలో విద్యుత్ సమస్యకు పరిష్కారం..

మంత్రి అడ్డూరి

లక్ష్మణ్ కుమార్‌కు గ్రామస్థుల కృతజ్ఞతలు

ధర్మపురి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

ధర్మపురి మండలం ఆరెపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యపై మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ స్పందించడంతో స్థానికులకు ఉపశమనం లభించింది. గ్రామంలో విద్యుత్ సదుపాయాలకు సంబంధించిన ఇబ్బందులతో పాటు వీధి దీపాలు వెలగక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అధికారుల సహకారంతో అవసరమైన మరమ్మతులు చేయించి, వీధి దీపాలను ఏర్పాటు చేయించడంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో వెలుగులు నిండాయి. దీంతో సంతోషం వ్యక్తం చేసిన గ్రామస్థులు మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్‌కు, సమస్య పరిష్కారానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నీరుగంటి చంద్రశేఖర్‌కు ప్రజాదరణ..

కూటమి శ్రేణుల్లో ఉత్సాహం!

14 ఎంపీటీసీ స్థానాలపై కూటమి గురి..

ప్రచారంలో దూసుకెళ్తున్న టీడీపీ నాయకుడు



సోమందేపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24

సోమందేపల్లి మండల ఎంపీటీసీ అభ్యర్థిగా బరిలో ఉన్న హిందూపురం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నాయకుడిగా ఆయనకు గుర్తింపు ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలుస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా చంద్రశేఖర్‌కు పేరుంది. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా తన వంతు సహకారం అందించారని పార్టీ నాయకులు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందించడం ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ చంద్రశేఖర్ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఆయనకు లభిస్తున్న స్పందనతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సోమందేపల్లి మండలంలోని మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. చంద్రశేఖర్‌కు పార్టీలకు అతీతంగా ప్రజల మద్దతు లభిస్తోందని కూటమి నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పులివెందులలో 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచార జోరు!

పోస్టర్ ఆవిష్కరించిన మారెడ్డి లత రెడ్డి, సామకోటి ఆదినారాయణ



పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24

పులివెందులలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. పులివెందుల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం, తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పులివెందుల మాజీ జడ్పీటీసీ మారెడ్డి లత రెడ్డి, పులివెందుల నియోజకవర్గ పరిశీలకుడు సామకోటి ఆదినారాయణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందనే సందేశాన్ని 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని కూటమి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నాయకులు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకువస్తూ సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. 'చెప్పాం.. చేస్తున్నాం' ప్రచారం ద్వారా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిలిలో 65 నామినేషన్లకు ఆమోదం

ఈ నెల 27న తుది అభ్యర్థుల జాబితా

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

భీమిలి మండలంలోని 12 పంచాయతీల పరిధిలో ఎంపీటీసీ స్థానాలకు దాఖలైన 65 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించి ఆమోదించారు. శుక్రవారం ఒక్కరోజే 47 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. రమేష్ నాయుడు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఈ నెల 27న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు.



మేయర్ పీఠంపై కూటమి గురి..

భారీ మెజారిటీపై గంటా ధీమా!

ముక్కా శ్రావణి విజయమే లక్ష్యంగా కూటమి శ్రేణులకు దిశానిర్దేశం

మధురవాడ, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకోవడం ఖాయమని, భారీ మెజారిటీ సాధించడమే తమ లక్ష్యమని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి విజయంతో పాటు అన్ని వార్డుల్లోనూ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపుపై నమ్మకం కోల్పోయిందని విమర్శించారు. శనివారం మధురవాడలోని వైజాగ్ కన్వెన్షన్‌లో మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులతో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. భీమిలి అర్బన్ ప్రాంతం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలుస్తోందని పేర్కొన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఓడిపోయినప్పటికీ జీవీఎంసీ పరిధిలో పార్టీకి ఆధిక్యం లభించిందని గుర్తుచేశారు. 2024 ఎన్నికల్లో తనకు వచ్చిన 93 వేల ఓట్ల మెజారిటీలో 65 వేల ఓట్లు జీవీఎంసీ పరిధిలోనే వచ్చాయని తెలిపారు. దేశానికి ప్రధానమంత్రి, రాష్ట్రానికి ముఖ్యమంత్రి, అసెంబ్లీకి ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో, వార్డుకు కార్పొరేటర్ కూడా అంతే ముఖ్యమని గంటా వ్యాఖ్యానించారు. మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు నిబద్ధత కలిగిన కార్యకర్త కావడంతో 2000 సంవత్సరంలో పొత్తులో భాగంగా బీజేపీకి వెళ్లాల్సిన కార్పొరేటర్ టికెట్‌ను టీడీపీకి ఇప్పించానని వెల్లడించారు. 2021 ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలను ఎదుర్కొని ఉత్తర నియోజకవర్గ పరిధిలోని 17 వార్డుల్లో శ్రావణి ఒక్కరే విజయం సాధించారని గుర్తుచేశారు. దసరా రోజున సద్గురు శివానందమూర్తి ఆశ్రమంలో చండీయాగం నిర్వహించి, భీమిలి నుంచే ముక్కా శ్రావణితో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించామని గంటా తెలిపారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. విశాఖపట్నంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక అభిమానం ఉందని గంటా పేర్కొన్నారు. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌తో పాటు ప్రముఖ ఐటీ సంస్థల ఏర్పాటుతో విశాఖ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. పొత్తుల్లో మిత్రధర్మాన్ని గౌరవిస్తూ టికెట్ల సర్దుబాటు చేయాల్సి వచ్చిందని, దీంతో నిరాశకు గురైన ఆశావహులకు భవిష్యత్తులో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. అన్ని స్థానాల్లో విజయం సాధించి కూటమి ఐక్యతను చాటాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



గంటా సహకారం మరువలేనిది: ముక్కా శ్రావణి

మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి మాట్లాడుతూ, 2000లో తన తండ్రికి, 2021లో తనకు టీడీపీ కార్పొరేటర్ టికెట్లు లభించడంలో గంటా శ్రీనివాసరావు కీలక పాత్ర పోషించారని తెలిపారు. మేయర్ అభ్యర్థిగా అవకాశం లభించిన అనంతరం గంటా ప్రాతినిధ్యం వహిస్తున్న భీమిలి నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టడం తనకు ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో విజయాన్ని సాధిస్తాననే విశ్వాసం వ్యక్తం చేశారు. అనంతరం మధురవాడ జోన్ పరిధిలోని వివిధ వార్డుల నుంచి పోటీ చేస్తున్న కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు మన్యాల సురేష్, అర్జాల మహేశ్వరి, పిల్లా రేవతి, నాగోతి రూపా కుమారి, గరే జ్యోతి, శాఖారి శ్రీనివాస్, పీవీ నరసింహంలను గంటా శ్రీనివాసరావు కార్యకర్తలకు పరిచయం చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, బీజేపీ ఇన్‌చార్జి జీరు కైలాష్ రెడ్డి, టీడీపీ భీమిలి ఇన్‌చార్జి చిక్కాల విజయ్ బాబు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో టీడీపీ మున్సిపల్ ఎన్నికల ప్రచార హోరు!

ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్న తూగుట్ల మధుసూదన్ రెడ్డి



పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

పులివెందుల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ దూకుడు పెంచింది. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు తూగుట్ల మధుసూదన్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిని తూగుట్ల గీతాకుమారి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూగుట్ల మధుసూదన్ రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య, అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ, గుంతలమయమైన రహదారుల దుస్థితిపై ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించి, తమకు ఉపశమనం కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలపై స్పందించిన మధుసూదన్ రెడ్డి ప్రచార సమయంలోనే సంబంధిత మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. అనంతరం వార్డు ప్రజలతో మాట్లాడుతూ పులివెందుల పట్టణ సమగ్ర అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, తాగునీటి సమస్యను పరిష్కరించడం, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, రహదారుల అభివృద్ధికి కృషి చేయడం తమ ప్రాధాన్యాలుగా ఉంటాయని తెలిపారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిని తూగుట్ల గీతాకుమారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీకి ప్రజలు మద్దతు తెలిపి మున్సిపల్ పీఠాన్ని కట్టబెడితే, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ముమ్మర ప్రచార కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో మంత్రి సుభాష్ విస్తృత ప్రచారం

అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి కూటమి నేతలు

రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:



రామచంద్రపురం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం 29, 30, 31వ వార్డుల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మేడిశెట్టి శేషారావుతో పాటు కూటమి అభ్యర్థులను పరిచయం చేస్తూ, పట్టణంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. చైర్మన్, వార్డు అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మేడిశెట్టి శేషారావు, 31వ వార్డు అభ్యర్థి గుబ్బల వెంకటరమణ, 29వ వార్డు అభ్యర్థి అంగర జయలక్ష్మి, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి కూటమి ప్రభుత్వానికి ఓటెయ్యాలి

ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 24:


ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని 13, 14వ వార్డుల్లో కూటమి అభ్యర్థులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన పార్టీ చైర్‌పర్సన్ అభ్యర్థిని గుబ్బల గంగా రత్న భవాని,13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సానబోయిన దుర్గాదేవి, 14వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సాధనాల వెంకట దుర్గా లక్ష్మి తో కలిసి ఎమ్మెల్యే దాట్ల (బుచ్చిబాబు), సుబ్బరాజు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లోని ప్రజలను కలుసుకుంటూ కూటమి అభ్యర్థులు ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, స్థానికులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుబ్బరాజు మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధి ని చూసి కూటమి ప్రభుత్వానికి ఓటు వేయాలని, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాలంటే ఓటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, తాడి నరసింహారావు, ముమ్మిడివరం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా సత్తిబాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిలి జోన్‌లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం ముమ్మరం

వరుదు కల్యాణి సహా కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతుగా వాసుపల్లి జానకిరామ్ విస్తృత ప్రచారం

భీమిలి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో భీమిలి జోన్ పరిధిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ బొత్స అనూష సూచనలతో పార్టీ నాయకుడు వాసుపల్లి జానకిరామ్ వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జీవీఎంసీ మేయర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణితో పాటు భీమిలి జోన్‌లోని మొదటి వార్డు అభ్యర్థి తారాద సృజన, రెండో వార్డు అభ్యర్థి అక్కరమాని రామనాయుడు, నాలుగో వార్డు అభ్యర్థి అల్లిపిల్లి పార్వతికి మద్దతుగా ప్రజలను కలుసుకుని పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా వాసుపల్లి జానకిరామ్ మాట్లాడుతూ, భీమిలి జోన్‌లో పార్టీ అభ్యర్థుల తరఫున నిర్వహిస్తున్న ప్రచారానికి ప్రజల నుంచి స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఈ ఆదరణ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోందని తెలిపారు. జీవీఎంసీ మేయర్ పీఠాన్ని వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందనే ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన ఆయన, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యుత్ బిల్లుల భారం, ఎన్నికల హామీల అమలు, భూముల వ్యవహారాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని అన్నారు. విశాఖపట్నం నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో అభివృద్ధి, తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని జానకిరామ్ పేర్కొన్నారు. నగర ప్రజల సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ కృషి చేస్తుందని తెలిపారు. జీవీఎంసీ మేయర్ అభ్యర్థి వరుదు కల్యాణిని గెలిపించాలని, అలాగే భీమిలి జోన్‌లోని పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మేయర్ పీఠాన్ని లక్ష్యంగా చేసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు.





పులివెందులలో వైసీపీ ఎన్నికల ప్రచార జోరు

12, 13, 14వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించిన వై.ఎస్. ప్రేమిల, శిల్ప

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థి వై.ఎస్. ప్రేమిల, ఆమె కోడలు శిల్ప శనివారం పట్టణంలోని 12, 13, 14వ వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా వై.ఎస్. ప్రేమిల, శిల్ప స్థానిక ప్రజలతో మమేకమై వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత వంటి అంశాలను ప్రజలు వారి దృష్టికి తీసుకురాగా, సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వై.ఎస్. ప్రేమిల మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పులివెందుల



మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల విస్తరణ, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని నాలుగు వైపులా నీటి ట్యాంకుల నిర్మాణం, రాణితోపు ప్రాంతంలో వాకర్స్, పిల్లలకు ఆహ్లాదాన్ని అందించేలా పార్కు అభివృద్ధి, ఉలిమెళ్ల ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన, శిల్పారామం వంటి అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం చేపట్టిందని వివరించారు. పులివెందుల పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని ఆమె తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, ప్రజల మద్దతు కోరుతూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మొల్లి హేమంత్ కు మద్దతుగా పేడాడ రమణికుమారి ప్రచారం



విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్:

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖ తూర్పు నియోజకవర్గంలోని 15వ వార్డు లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మహిళా విభాగం అధ్యక్షురాలు, విశాఖ తూర్పు నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి పాల్గొన్నారు. 15వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థి మొల్లి హేమంత్ కుమార్‌కు మద్దతుగా ఆమె బాలాజీనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అభ్యర్థి మొల్లి హేమంత్ కుమార్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. అలాగే జీవీఎంసీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణికి మద్దతు తెలిపి, ఆమెను కూడా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఓటర్లను కలుసుకుంటూ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పేడాడ రమణికుమారి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొని ప్రచారంలో భాగస్వాములయ్యారు.

కువైట్ నుంచి మహిళకు విముక్తి..

స్వదేశానికి సురక్షితంగా రప్పింపు



అలమూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

అలమూరు మండలం బడుగువానిలంక గ్రామానికి చెందిన ఎం. పుష్ప కువైట్‌లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆమె తండ్రి ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ ఆదేశాల మేరకు మైగ్రేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్ అధికారులు స్పందించారు. సంబంధిత అధికారుల సమన్వయంతో ఆమెను సురక్షితంగా భారతదేశానికి రప్పించారు. ఉపాధి కోసం 2024 జూలైలో కువైట్‌కు వెళ్లిన పుష్ప, రెండేళ్లపాటు గృహ కార్మికురాలిగా పనిచేశారు. మరో ఏడాది పనిచేయాలని ఒత్తిడి రావడంతో ఆమె తండ్రి ఫిర్యాదు చేశారు. స్వదేశానికి చేరుకున్న పుష్ప తన భర్తతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి, మైగ్రేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్ నోడల్ అధికారి వీర్ల సుబ్బారావును కలిసి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని మైగ్రేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్ సమన్వయకర్త గోళ్ల రమేష్ వెల్లడించారు. కార్యక్రమంలో కడియాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

57వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి తట్టా సౌజన్య ఇంటింటి ప్రచారం

విశాఖపట్నం, కంచరపాలెం, సిటిజన్ టైమ్స్

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం 57వ వార్డులో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. స్వతంత్ర కార్పొరేటర్ అభ్యర్థి తట్టా సౌజన్య వార్డులో ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకుంటూ తన ఎన్నికల గుర్తు ఉంగరంపై ఓటు వేసి మద్దతు తెలపాలని కోరుతున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. వార్డులోని ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకుని తన అభ్యర్థిత్వాన్ని పరిచయం చేసుకుంటున్నారు. దీంతో 57వ వార్డులో ఎన్నికల ప్రచారం సందడిగా సాగుతోంది.



కార్మికుల భద్రత గాలికి.. ధనలక్ష్మి పరిశ్రమపై ఆగ్రహం

-యాజమాన్యం తీరుపై మండిపడ్డ మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

-నిబంధనలు పాటించని పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

గుమ్మడిదల,సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 24

పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళనకరమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. బొంతపల్లి గ్రామంలోని ధనలక్ష్మి పరిశ్రమలో ఇటీవల కార్మికుడు మృతిచెందిన నేపథ్యంలో వార్డు కౌన్సిలర్లతో కలిసి ఆయన పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కార్మికుడి మృతి ఘటనపై పరిశ్రమ యాజమాన్యం వ్యవహరించిన తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికులకు అవసరమైన భద్రతా సదుపాయాలు కల్పించడం యాజమాన్యాల బాధ్యత అని స్పష్టం చేశారు. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. స్థానిక ప్రాంతాల్లో పరిశ్రమలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల భద్రతతో పాటు స్థానిక యువతకు ఉపాధి కల్పించే విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలని



అన్నారు. నిబంధనలు పాటించని ఈ పరిశ్రమపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సురభి కుమార్ గౌడ్, శ్రీ చూర్ణం చక్రపాణి, సద్ది జయపాల్ రెడ్డి, కత్తుల రమేష్, నాయకులు వెంకట్రాం రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి

టీవీలు, డిజిటల్, సోషల్ మీడియా ప్రకటనలపై ఎంసీఎంసీ నిఘా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: నోడల్ అధికారి కె. సదారావు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో టీవీ ఛానళ్లు, డిజిటల్ మాధ్యమాలు, సోషల్ మీడియా సహా వివిధ ప్రచార వేదికల ద్వారా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయడానికి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నోడల్ అధికారి, సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. సదారావు స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా రాజకీయ ప్రకటనల ప్రసారం, ప్రచురణ ఉండాలని ఆయన సూచించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సెల్లార్‌లోని క్యాంటీన్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రం, మీడియా సెంటర్ ద్వారా ఎన్నికల ప్రచారానికి సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

మూడు రోజుల ముందుగా దరఖాస్తు చేయాలి

టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ఆడియో--విజువల్ ప్రదర్శనలు, వాహనాలపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా ప్రసారం చేసే రాజకీయ ప్రకటనలకు సంబంధిత కమిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కె. సదారావు పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల అభ్యర్థులు ప్రకటనలను ప్రసారం చేయడానికి లేదా ప్రదర్శించడానికి కనీసం మూడు రోజుల ముందుగా సంబంధిత కమిటీకి దరఖాస్తు సమర్పించి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు.

పెయిడ్ న్యూస్‌పై ప్రత్యేక పర్యవేక్షణ

ఎన్నికల ప్రచార సమయంలో వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా వెలువడుతున్న వార్తలను నిరంతరం పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వార్తల రూపంలో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించేందుకు ఎంసీఎంసీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఏదైనా వార్తను పెయిడ్ న్యూస్‌గా గుర్తించినట్లయితే, ఎన్నికల నిబంధనల ప్రకారం సంబంధిత అభ్యర్థి ఎన్నికల వ్యయంలో ఆ ప్రచారానికి సంబంధించిన ఖర్చును చేర్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

అనధికారిక ప్రకటనలపై నోటీసులు

కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లలో అనుమతులు లేకుండా రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్ కథనాలు ప్రసారం లేదా ప్రచురితమైనట్లు ఎంసీఎంసీ గుర్తించిందని నోడల్ అధికారి తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆయా ఛానళ్లకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. జీవీఎంసీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా సాగేందుకు మీడియా సంస్థలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎంసీఎంసీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కె. సదారావు సూచించారు.

సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

సీసీటీవీ పర్యవేక్షణలో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి



ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 24.:

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి, ఆయా కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకురాలు పి. ప్రశాంతి, అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం జిల్లాలోని పలు మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ, ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రతా చర్యలను జిల్లా ఎన్నికల పరిశీలకురాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని ఇందిరాగాంధీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మల్కిపురం, సఖినేటిపల్లి,మామిడి కుదురు, అల్లవరం, అమలాపురం జెడ్పీ సీఈఓ కార్యాలయం, కె.గంగవరం, ఐ. పోలవరం మండలాల్లోని సంబంధిత కార్యాలయాలను సందర్శించి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. ఐ. పోలవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల పరిశీలకురాలు పి. ప్రశాంతి మాట్లాడుతూ, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు తూచా తప్పకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో హార్టికల్చర్ జాయింట్ డైరెక్టర్ బి.రమణ,ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్ రవివర్మ, ముమ్మిడివరం తహసీల్దార్ టి. సుభాష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ అభ్యర్థిగా వై రాశేఖర్ రెడ్డి నామినేషన్

మంత్రి సవితమ్మ ఆశీస్సులతో నామినేషన్ దాఖలు

పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు

సోమందేపల్లి, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:



శ్రీ సత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలంలోని తుంగోడు పంచాయతీ ఎంపీటీసీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరఫున వై రాశేఖర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర మంత్రి సవితమ్మ ఆశీస్సులతో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచి, ప్రోత్సహించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తుంగోడు పంచాయతీ ప్రజలు, స్నేహితులు, బంధుమిత్రులందరికీ వై రాశేఖర్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై చూపుతున్న ప్రేమాభిమానాలు, ఆదరణ, ఆశీస్సులు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తుంగోడు పంచాయతీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ప్రజల ఆశీస్సులే తన బలమని, ప్రజాసేవే తన ప్రధాన లక్ష్యమని వై రాశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల సహకారం, మద్దతు అందించాలని కోరుతూ, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజాసేవకు అవకాశం కల్పించాలని తుంగోడు పంచాయతీ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమల ప్రమాదాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం.. బాధితులకు న్యాయం చేయాలి!

సరాక, సిగాచి ఘటనలపై సమగ్ర విచారణకు మెట్టు శ్రీధర్ డిమాండ్



పటాన్‌చెరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 24:

ఫార్మా, రసాయన పరిశ్రమల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం ఆందోళనకరమని తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ విమర్శించారు. సరాక లాబొరేటరీస్, పాశమైలారం సిగాచి పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సరాక లాబొరేటరీస్ ప్రధాన ద్వారం వద్ద రాజ్‌గోపాల్ యాదవ్, రోహిత్ సింగ్, మనీష్‌లతో కలిసి ఆయన నిరసన తెలిపారు. సరాక పరిశ్రమలో క్లోరోఫార్మ్ లీకేజీ ఘటనలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరో ఆరుగురు అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని, ఫ్యాక్టరీస్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలని కోరారు. సిగాచి, సరాక ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రకటించిన పరిహారం పూర్తిస్థాయిలో అందించాలని, గాయపడిన కార్మికులకు వైద్యసాయం, ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. భద్రతా నిబంధనలు ఉల్లంఘించే పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించి, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మెట్టు శ్రీధర్ స్పష్టం చేశారు.

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ ని గెలిపించండి

ఎమ్మెల్యే తనయుడు కరణ్ ప్రచార జోరు

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 24

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తనయుడు, యువనాయకులు కరణ్ 23వ వార్డు పరిధిలోని బుచ్చెమ్మ అగ్రహారం కుమ్మర్ల వీధుల్లో నిర్వహించిన క్షేత్రస్థాయి ఇంటింటి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జనసేన పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ కి గాజు గ్లాస్ గుర్తుకు, తెలుగుదేశం పార్టీ 23వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చిక్కాల లక్ష్మి సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కరణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో బుచ్చెమ్మ అగ్రహారం, కుమ్మర్ల వీధులతో పాటు 23వ వార్డును మోడల్ వార్డుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డు ప్రజలందరూ కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





ఒక్కో వ్యాధికి ఒక్కో రకం వెల్లుల్లి

ఎన్నో వ్యాధులకు ప్రకృతి ప్రసాదించిన ఔషధంగా భావిస్తోన్న వెల్లుల్లిపై సరికొత్త పరిశోధనలు జరుగుతున్నాయి. వెల్లుల్లిలోని ఎలిసిన్.. అంటువ్యాధులు, శ్వాసకోశ రుగ్మతలపై పనిచేస్తుంది. గంధక ధాతువులు...అధిక రక్తపోటును, కొలెస్ట్రాల్‌నూ తగ్గిస్తాయి. సెలీనియం క్యాన్సర్ కణాలవ్యాప్తిని తగ్గిస్తుంది. ఫ్లేవనాయిడ్లు గుండె ధమనులను కాపాడతాయి. యాంటీ ఆక్సిడెంట్లు మధుమేహం, వృద్ధాప్యం మీద పనిచేస్తాయని ఇప్పటికే శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, వెల్లుల్లికి ఉన్న ఈ సహజ రోగ నిరోధక లక్షణాలను నానో టెక్నాలజీతో మరింత ఇనుమడింపజేయవచ్చని అలహాబాద్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు కె.ఎన్.ఉత్తమ్ నిర్ధారించారు. ఆయన ఆధ్వర్యంలో పరిశోధకులు వెల్లుల్లి మొక్కపై టైటానియం డయాక్సైడ్ నానో పార్టికిల్స్‌ను ప్రయోగించారు. ఈ నానో అణువులు వెల్లుల్లిలోని పోషక వ్యవస్థను మరింత బలోపేతం చేశాయి. ఫలితంగా వెల్లుల్లిలో గంధకం, భాస్వరం, క్యాల్షియం, జింక్, ఇనుము ధాతువులు సాధారణం కన్నా ఎక్కువగా ఏర్పడ్డాయి. యాంటీ ఆక్సిడెంట్లు 30 నుంచి 40 శాతం పెరిగాయి. వెల్లుల్లిలోని ఏ ధాతువు ఏ వ్యాధి చికిత్సకు తోడ్పడుతుందో నిర్ధారించుకుని ఆయా రోగాల చికిత్సకు పరిశోధనశాలలో వేర్వేరు వెల్లుల్లి రకాలను రూపొందించి పొలాల్లో సాగు చేయించాలని ఉత్తమ్ బృందం యోచిస్తోంది. ఇలాంటి రకాలకు పేటెంట్లు తీసుకుని రెండేళ్లలో రైతుకు అందించాలనుకుంటున్నామని ఉత్తమ్ చెప్పారు.


హైబీపీతో గుండెకే కాదు...


కంటిచూపుకూ ముప్పు! వైద్యుల హెచ్చరిక

రక్తపోటును తేలిగ్గా తీసుకోవద్దు

రెటీనాలోని సున్నితమైన రక్తనాళాలను దెబ్బతీస్తున్న హైపర్‌టెన్షన్

బీపీని అదుపులో ఉంచుకోవడమే కళ్లను కాపాడుకోవడానికి మార్గం





అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) గుండె జబ్బులకు, పక్షపాతానికి దారితీస్తుందని మనందరికీ తెలుసు. అందుకే దానిని 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తారు. అయితే, నియంత్రణలో లేని బీపీ వల్ల కేవలం గుండెకే కాకుండా మన కంటిచూపునకు కూడా తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక రక్తపోటు నేరుగా కంటిలోని రెటీనాపై ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రెటీనా అనేది కంటిలో ఉండే అత్యంత సున్నితమైన కాంతి-గ్రహణ పొర. దీర్ఘకాలం పాటు బీపీ అదుపులో ఉంటే, రెటీనాలోని రక్తనాళాలపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ఫలితంగా ఆ రక్తనాళాలు దెబ్బతినడం, గట్టిపడటం లేదా కుచించుకుపోవడం జరుగుతుంది. ఈ పరిస్థితిని 'హైపర్‌టెన్సివ్ రెటినోపతీ' అని పిలుస్తారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ప్రారంభ దశలో దీని లక్షణాలేవీ బయటకు కనిపించవు. సమస్య ముదిరినప్పుడు దెబ్బతిన్న రక్తనాళాల నుంచి ద్రవాలు లేదా రక్తం లీక్ అవ్వడం మొదలవుతుంది. దీనివల్ల రెటీనాలో వాపు, దృష్టి మసకబారడం, కొన్ని సందర్భాల్లో పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అంతేకాకుండా, హైపర్‌టెన్షన్ వల్ల దృష్టి నరం (ఆప్టిక్ నర్వ్) దెబ్బతినడం, రెటీనా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం (బ్లాకేజ్) వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చు. ఈ బ్లాకేజ్‌లు ఏర్పడటం అత్యవసర పరిస్థితి అని, వెంటనే చికిత్స తీసుకోకపోతే శాశ్వత అంధత్వం వస్తుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. అందుకే 40 ఏళ్లు దాటిన వారు, ఇప్పటికే బీపీతో బాధపడుతున్నవారు తప్పనిసరిగా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. జీవనశైలి మార్పులు, సరైన మందులతో

ఆరోగ్యం



ఒబేసిటీ సమస్య మందులతో పోయేది కాదు: డబ్ల్యూహెచ్ఓ

స్థూలకాయంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ తొలిసారిగా మార్గదర్శకాలు

జీఎల్పీ-1 మందులు మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం

మందులతో పాటు ఆహార నియమాలు, వ్యాయామం కూడా ముఖ్యమనని సూచన

ప్రపంచవ్యాప్తంగా ఏటా లక్షలాది మరణాలకు కారణమవుతున్న స్థూలకాయం (ఒబేసిటీ) సమస్యపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఊబకాయం చికిత్సలో వాడుతున్న గ్లూకాగాన్-లైక్ పెప్టైడ్-1 (జీఎల్పీ-1) రకం మందులు సమర్థవంతమైనవే అయినప్పటికీ, కేవలం వాటితోనే ఈ ప్రపంచ ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించలేమని సోమవారం విడుదల చేసిన నివేదికలో స్పష్టం చేసింది. మందులతో పాటు జీవనశైలి మార్పులు కూడా అంతే ముఖ్యమని తేల్చిచెప్పింది. ప్రపంచవ్యాప్తంగా వంద కోట్లకు పైగా ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. పెద్దవారిలో బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 30 లేదా అంతకంటే ఎక్కువగా ఉండటాన్ని స్థూలకాయంగా పరిగణిస్తారు. దీని చికిత్స కోసం లిరాగ్లుటైడ్, సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ వంటి జీఎల్పీ-1 మందుల వాడకానికి డబ్ల్యూహెచ్ఓ షరతులతో కూడిన సిఫార్సులు చేసింది. ఈ మందులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంతో పాటు బరువు తగ్గడానికి, గుండె, కిడ్నీ సమస్యల ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడతాయి. అయితే, ఈ మందులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ విపరీతంగా పెరగడంతో నకిలీ, నాణ్యతలేని ఉత్పత్తులు మార్కెట్లోకి వస్తున్నాయని డబ్ల్యూహెచ్ఓ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రోగుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది. "స్థూలకాయం ఒక దీర్ఘకాలిక వ్యాధి. దీనికి సమగ్రమైన చికిత్స అవసరం. కేవలం మందులతోనే ఈ సమస్యను అధిగమించలేం. అయితే, లక్షలాది మందికి చికిత్సలో జీఎల్పీ-1 మందులు ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడతాయి" అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు. ఈ మందులు వాడే వ్యక్తులు తప్పనిసరిగా ఆరోగ్యకరమైన ఆహార నియమాలు, క్రమం తప్పని వ్యాయామం వంటి జీవనశైలి మార్పులను అనుసరించాలని, ఆరోగ్య నిపుణుల పర్యవేక్షణలో ఉండాలని గైడ్‌లైన్స్‌లో స్పష్టం చేశారు. స్థూలకాయం వల్ల గుండె జబ్బులు, టైప్-2 డయాబెటిస్, కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ఈ సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొనకపోతే 2030 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఏటా 3 ట్రిలియన్ డాలర్ల భారం పడుతుందని అంచనా వేసింది.



చిన్నప్పటి వైరస్‌తో బ్లాడర్ క్యాన్సర్..

శరీర రక్షణే శాపమా?

చిన్నప్పుడు సోకే బీకే వైరస్‌తో బ్లాడర్ క్యాన్సర్ ముప్పు

వైరస్‌పై పోరాటంలో మన కణాల డీఎన్ఏ దెబ్బతింటున్న వైనం

యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ యార్క్ శాస్త్రవేత్తల పరిశోధన


వైరస్‌ను ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారణకు అవకాశం

చిన్నతనంలో సర్వసాధారణంగా సోకే ఒక వైరస్, భవిష్యత్తులో బ్లాడర్ క్యాన్సర్‌కు కారణం కావచ్చని యూకే పరిశోధకులు తేల్చారు. ఈ వైరస్‌ను ముందుగా గుర్తించి నియంత్రించగలిగితే, బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించేందుకు ఒక కొత్త మార్గం దొరుకుతుందని యూనివర్సిటీ ఆఫ్ యార్క్ శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఈ అధ్యయన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధన ప్రకారం బాల్యంలో సోకే 'బీకే వైరస్' ఎలాంటి లక్షణాలు చూపించకుండా కిడ్నీలలో నిద్రాణంగా ఉండిపోతుంది. అయితే, ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు మన శరీరంలోని రక్షణ వ్యవస్థ చేసే పోరాటమే అసలు సమస్యకు కారణమవుతోంది. వైరస్‌పై దాడి చేసేందుకు ఉద్దేశించిన ఎంజైమ్‌లు, పొరపాటున మన శరీర కణాల డీఎన్ఏనే దెబ్బతీస్తున్నాయి. ఈ ప్రక్రియను పరిశోధకులు 'ఫ్రెండ్లీ ఫైర్'గా అభివర్ణించారు. ఇలా దెబ్బతిన్న డీఎన్ఏ కాలక్రమేణా క్యాన్సర్‌కు దారితీస్తుందని వారు కనుగొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సైమన్ బేకర్ మాట్లాడుతూ.. "సాధారణంగా సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటిలో వైరస్ డీఎన్ఏ మన జన్యుపదార్థంతో కలిసిపోయి కణితులు ఏర్పడటానికి కారణమవుతుంది. కానీ, బ్లాడర్ క్యాన్సర్ విషయంలో వైరస్‌పై మన శరీరం జరిపే ప్రతిస్పందనే డీఎన్ఏ మార్పులకు, తద్వారా క్యాన్సర్‌కు కారణమవుతున్నట్లు మా పరిశోధనలో తేలింది" అని వివరించారు. వైరస్ సోకిన కణాలతో పాటు వాటి చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణాల డీఎన్ఏ కూడా దెబ్బతింటున్నట్లు గుర్తించారు. చాలా ఏళ్ల తర్వాత బ్లాడర్ క్యాన్సర్‌ను గుర్తించే సమయానికి కణితులలో వైరస్ ఆనవాళ్లు ఎందుకు కనిపించవనే దానికి ఇది సమాధానం కావచ్చునని బేకర్ తెలిపారు. ప్రస్తుతం ధూమపానం మానేయడం ద్వారా బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించాలని సూచిస్తున్నారు. తాజా పరిశోధన ఫలితాలు బీకే వైరస్‌ను నియంత్రించడం ద్వారా ఈ క్యాన్సర్‌ను నివారించేందుకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి.



ఎర్రని బ్రోకేడ్ దుస్తుల్లో మెరిసిపోతున్న శ్రీముఖి

కంటెంట్ పై నమ్మకం.. మరి రిస్క్? సవాలా?





రూఫ్‌టాప్‌పై స్టైలిష్ డెనిమ్ లుక్‌లో ఆకట్టుకుంటున్న శివాంగి వర్మ

సినిమాపై నమ్మకం ఉండటం వేరు.. ఆ నమ్మకాన్ని బాక్సాఫీస్ దగ్గర ప్రూవ్ చేసుకోవడం వేరు. ముఖ్యంగా భారీ బడ్జెట్ తో తెరకెక్కిన సినిమాలకు విడుదల తేదీ కూడా రిజల్ట్ పై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఇప్పుడు మెగా మేనల్లుడు సాయిదుర్గా తేజ్ నటిస్తున్న సంబరాల ఏటిగట్టు (శ్రీ+) విషయంలో అదే పరిస్థితి కనిపిస్తోంది. కంటెంట్ పై మూవీ టీమ్ కు నమ్మకమున్నా.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది హాట్ టాపిక్ గా మారింది.

సాయిదుర్గా తేజ్ కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం సంబరాల ఏటిగట్టు. దర్శకుడు రోహిత్ కేపీ ఆ సినిమాతో పరిచయం అవుతున్నారు. పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్ గా రూపొందుతున్న ఆ చిత్రం కోసం తేజ్ రెండేళ్లకు పైగా సమయాన్ని కేటాయించారు. కొత్త లుక్ లో కనిపించేందుకు స్పెషల్ గా రెడీ అయ్యారు. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన ఆ సినిమా షూటింగ్ కూడా పూర్తయింది.ముందుగా ప్రకటించిన ప్రకారం 2027 జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రావాలి. సంక్రాంతి సీజన్ లో సినిమాను రిలీజ్ చేయడం ఎంతవరకు కలిసొస్తుందనేది ఇప్పుడు కీలకం. పండగ సెలవులు ఉండటంతో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తారు. దీంతో సినిమాకు మంచి వసూళ్లు సాధించే అవకాశం ఉంటుంది. అయితే పోటీ ఎక్కువైతే థియేటర్లు, షోల సంఖ్య తగ్గే ప్రమాదం ఉంది. సినిమా బాగున్నా సరైన స్థాయిలో థియేటర్లు దక్కకపోతే వసూళ్లపై ప్రభావం పడొచ్చు. భారీ బడ్జెట్ తో తెరకెక్కిన SYGకు ఇది ఇంపార్టెంట్ విషయం.అందుకే సంక్రాంతి నుంచి తప్పుకోవడం కూడా అంత ఈజీ కాదు. మరో తేదీకి వాయిదా వేసుకుంటే పోటీ తగ్గి ఎక్కువ థియేటర్లు దక్కే అవకాశం ఉంటుంది. కానీ సోలోగా విడుదల చేసినంత మాత్రాన వసూళ్లు వచ్చేస్తాయనే హామీ లేదు. పండగ సీజన్ లో ఉండే ప్రేక్షకుల రద్దీ, హాలీడేస్ బెనిఫిట్ మరో సమయంలో ఉండకపోవచ్చు. ముఖ్యంగా సినిమాకు వచ్చే టాక్ బట్టి పోటీ లేకపోయినా వసూళ్లు ఆశించిన స్థాయికి చేరకపోవచ్చు. చివరకు ప్రేక్షకులకు నచ్చితేనే సినిమా నిలబడుతుంది.ఇదే శ్రీ+ టీమ్ కు అదే అసలు టెస్ట్ . సినిమా కంటెంట్ పై నమ్మకంతో ప్రకటించిన తేదీకే వస్తే పోటీని తట్టుకోవాలి. మరోవైపు వాయిదా వేసుకుంటే కంటెంట్ పైనే ఎక్కువగా ఆధారపడాల్సి ఉంటుంది. అంటే రెండు వేళ్లోని రిస్క్ ఉంది. అయితే స్టోరీ, యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటే పోటీని అధిగమించడం కూడా అసాధ్యం కాదు. అందుకే విడుదల తేదీ కంటే సినిమా కంటెంట్ పైనే ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది.ఇప్పటికే షూటింగ్ పూర్తవడంతో మూవీ టీమ్ ముందు విడుదలకు సంబంధించిన పనులే ఉన్నాయి. సినిమాపై ఉన్న నమ్మకాన్ని వసూళ్లుగా మార్చుకోవాలంటే సరైన టైమ్ ఎంచుకోవడం ముఖ్యం. అయితే విడుదల తేదీ ఛేంజ్ పై ఇప్పటివరకు అనౌన్స్మెంట్ రాలేదు. మరి SYG టీమ్ సంక్రాంతి రిస్క్ నే ఎంచుకుంటుందా.. లేక సోలో రిలీజ్ సవాల్ కు సిద్ధమవుతుందా? దీనిపై క్లారిటీ రావాలంటే మరికొంత సమయం వేచి చూడాల్సిందే.

భారత్‌కు విజయ 'తిలకం'.. రెండో టీ20లోనూ

టీమిండియా అద్భుత విజయం



- న్యూజిలాండ్ 20 ఓవర్లలో 180/5 స్కోరు
- గ్లెన్ ఫిలిప్స్ 70, బెవాన్ జాకబ్స్ 58 పరుగులు
- అర్ష్‌దీప్ సింగ్ ఖాతాలో రెండు వికెట్లు
- లక్ష్య ఛేదనలో భారత టాప్ ఆర్డర్ తడబాటు
- చివరి ఓవర్లలో అద్భుతం చేసిన తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి

టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో అతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది.181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ చేతుల్లోకి వెళ్లినట్లు కనిపించింది. ఆ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) బాధ్యత తీసుకున్నారు. తిలక్ (51 నాటౌట్: 6 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా, నితీశ్ భారీ షాట్లతో అతడికి అండగా నిలిచాడు. చివరి ఓవర్లలో వీరిద్దరి దూకుడుతో భారత్ విజయానికి చేరువైంది. చివరి ఓవర్‌కు ముందు 10 పరుగులు అవసరమైన దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన ఈ జోడీ లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ ఒత్తిడిని తట్టుకుని గెలవడం విశేషం. కీలక సమయంలో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ చూపిన పోరాటం, నితీశ్ రెడ్డి ఇచ్చిన సహకారం భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.

అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డ్..

భువనేశ్వర్‌ను అధిగమించిన యువ పేసర్!

ఒకే ఏడాదిలో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్
భువనేశ్వర్ కుమార్ 37 వికెట్ల రికార్డును అధిగమించిన పంజాబ్ పేసర్
2026లో ఇప్పటివరకు 38 వికెట్లు పడగొట్టిన అర్ష్‌దీప్ సింగ్
న్యూజిలాండ్‌తో రెండో టీ20లో ఈ అరుదైన ఘనత సాధన



భారత యువ ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పేరిట ఉన్న రికార్డును అతను అధిగమించాడు. న్యూజిలాండ్‌తో శనివారం హేగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నాడు.ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ 33 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. దీంతో 2026 క్యాలెండర్ సంవత్సరంలో అతని వికెట్ల సంఖ్య 38కి చేరింది. ఇంతకుముందు ఈ రికార్డు భువనేశ్వర్ కుమార్ పేరిట ఉండేది. భువనేశ్వర్ 2022 సీజన్ లో 37 వికెట్లు తీశాడు. విశేషమేమిటంటే, భువీ 31 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, అర్ష్‌దీప్ కేవలం 26 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును దాటడం అతని నిలకడకు నిదర్శనం.ఈ మ్యాచ్‌లో తొలుత టీమ్ సీఫర్ట్‌ను ఔట్ చేసి న్యూజిలాండ్‌కు తొలి దెబ్బతీసిన అర్ష్‌దీప్, ఆ తర్వాత ప్రమాదకరంగా మారుతున్న గ్లెన్ ఫిలిప్స్ (70) వికెట్‌ను కూడా పడగొట్టి రికార్డును సొంతం చేసుకున్నాడు. ఒక దశలో 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కివీస్‌ను, గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ (58) నాలుగో వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. దీంతో న్యూజిలాండ్ నిర్దిష్ట 20 ఓవర్లలో 180 పరుగులు చేయగలిగింది.
ఈ ప్రదర్శనతో, ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన ప్రపంచ బౌలర్ల జాబితాలో అర్ష్‌దీప్ మూడో స్థానానికి చేరాడు. ఐర్లాండ్‌కు చెందిన జాష్ లిటిల్ (39 వికెట్లు, 2022), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ (38 వికెట్లు, 2024) అతని కంటే ముందున్నారు.

ముంబై ఇండియన్స్ అభిమానుల అంచనాలను అందుకోలేకపోయాం.. ముందు అది అంగీకరించాలి: పొలార్డ్



ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ ఇటీవలి సీజన్లలో అభిమానుల అంచనాలకు తగ్గట్టుగా ఆడలేకపోయిందని ఆ జట్టు కొత్త హెడ్ కోచ్ కీరన్ పొలార్డ్ అంగీకరించాడు. తిరిగి పాత వైభవాన్ని సాధించాలంటే ముందుగా తమ లోపాలను గుర్తించి అంగీకరించాలని అన్నాడు. జట్టులో మళ్లీ పోరాట స్ఫూర్తిని నింపి, ప్రత్యర్థులు భయపడేలా ముంబైని తీర్చిదిద్దుతామని చెప్పాడు.గత నాలుగు ఐపీఎల్ సీజన్లలో బ్యాటింగ్ కోచ్‌గా పనిచేసిన పొలార్డ్.. మహేల జయవర్ధనే స్థానంలో ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2010లో ఆటగాడిగా ముంబైతో అనుబంధం ప్రారంభించిన అతడు.. 2013, 2015, 2017, 2019, 2020లో ఐపీఎల్ టైటిళ్లు సాధించిన జట్లలో భాగమయ్యాడు."మనం అభిమానులు కోరుకున్నంత గొప్పగా ఆడలేకపోయామని అంగీకరించాలి. మెరుగుపడటానికి తొలి అడుగు అదే. అభిమానులు మాకు ఎప్పుడూ అండగా ఉన్నారు. కొత్త తరం క్రికెటర్లతో కలిసి మళ్లీ మధుర జ్ఞాపకాలు సృష్టించాలని కోరుకుంటున్నాం. ముంబై మరోసారి నిర్భయంగా ఆడే జట్టుగా మారాలి" అని పొలార్డ్ తెలిపాడు.2020 తర్వాత ముంబై ఇండియన్స్ మరోసారి ఐపీఎల్ టైటిల్ గెలవలేదు. 2023, 2025లో ప్లేఆఫ్స్‌కు చేరినప్పటికీ.. 2024లో పదో స్థానం, 2026లో తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ వైఫల్యాలను దాచిపెట్టబోమని పొలార్డ్ స్పష్టం చేశాడు."వాంఖడే స్టేడియంలో ముంబై నీలి జెండా ఎగరాలి. అభిమానుల ఉత్సాహం, జట్టు పట్ల అభిమానం ఆటగాళ్లలోనూ కనిపించాలి. మనం ఎవరి కోసం, దేనికోసం ఆడుతున్నామో అర్థం చేసుకోవాలి. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టుకే ప్రాధాన్యం ఇస్తాం. ప్రత్యర్థులు ముంబైతో ఆడిన అనుభవాన్ని గతంలోలా గుర్తుంచుకునేలా చేయాలి. ముందుకు వెళ్లాలంటే కొన్నిసార్లు గతాన్ని గుర్తుచేసుకుని మన గుర్తింపును అర్థం చేసుకోవాలి" అని వివరించాడు.ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టడం ఇంకా కొత్త అనుభూతిగానే ఉందన్న పొలార్డ్.. ఆటగాడిగా ఉన్నప్పటి గెలుపు కసి తగ్గదని చెప్పాడు. "ఎప్పుడూ గెలవాలనే తపన, జట్టులో ఉత్సాహాన్ని నింపాలనే పట్టుదల అలాగే ఉంటాయి. కాకపోతే ఇప్పుడు మైదానానికి కొంచెం దూరం నుంచి నా పాత్ర పోషించాలి" అని పేర్కొన్నాడు.తనకు ముందు కోచ్‌గా పనిచేసిన మహేల జయవర్ధనే నుంచి ఎంతో నేర్చుకున్నానని పొలార్డ్ తెలిపాడు. ప్రత్యర్థిగా మొదలైన పరిచయం, అతడి శిక్షణలో ఆటగాడిగా, తర్వాత సహాయకుడిగా పనిచేసే వరకు కొనసాగిందని గుర్తుచేసుకున్నాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776